క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎస్సై



ములుగు: నూతనంగా ములుగు ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న పవన్‌కుమార్ శుక్రవారం ఎస్పీ గాష్ ఆలంకు మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో విధులు నిర్వహించేక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధులను, ఉద్యోగులను కలుపుకొని పోవాలని, పోలీసు శాఖకు చెడ్డ పేరు రాకుండా చూడాలని సూచించారు.

విద్యార్థుల ప్రతిభ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో శుక్రవారం 9, 10వ తరగతి విద్యార్థులకు శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పీవై లక్ష్మి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సంస్థ ట్రైనర్ ఉదయ్ సర్టిఫికెట్లను అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



మంగపేట: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన గాదె శ్రీనివాసాచారిని విశ్వబ్రాహ్మణ న్యాయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తు జిల్లా అధ్యక్షుడు గుంటోజు రమేశాచారి శుక్రవారం నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేశాచారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన విశ్వబ్రాహ్మణులు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ఏమాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. జనాభా దామాశా ప్రకారం తమ వాటా కోసం పోరాటం చేసి హక్కులు సాధించుకునేందుకు మరో పోరాటం చేసేందుకు విశ్వబ్రాహ్మణులు ముందడుగు వేయాలన్నారు.

పెరటితోటల పెంపకంపై అవగాహన

కాటారం: పోషణమాసంలో భాగంగా మండలంలోని అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో టీచర్ శ్రీలత శుక్రవారం పెరటితోటల పెంపకంపై పిల్లలకి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్న పెరటితోటల్లోకి చిన్నారులను తీసుకెళ్లి పలు రకాల కూరగాయల మొక్కల పెంపకం, వాటిని తినడం వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

చిట్యాల: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం చేసే అంశంపై బీజేపీ ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని ఎమ్మార్పీస్ జిల్లా ఇన్‌చార్జ్ బట్టు విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ నేరళ్ల ఓదెలు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బట్టు విజయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏండ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉందన్నారు. ఎన్నో బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించుకుంటున్న బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎందుకు పెట్టడం ప్రవేశపెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 4న హైదరాబాద్‌ను వేలాది మందితో దిగ్బంధం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసారపు సాంబయ్య, శనిగరపు మొగిలి, కుమ్మరి నర్సింహారాములు, తోటపెల్లి పోషాలు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన పాడుగుల సరేందర్ (57) రోజువారిలాగే గురువారం మేకలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం సమయానికి మేకలు ఇంటికి తిరిగి వచ్చాయి కానీ సరేందర్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఆచూకీ కోసం వెతికారు. కాగా శుక్రవారం అదే గ్రామ శివారులోని తూర్పాయకుంట దగ్గర అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. తన భర్త మృతిపై అనుమానంగా ఉందని మృతుడి భార్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

గ్రామాలను అన్ని రంగాల్లో ముందుంచాలి



ములుగు: అవార్డు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి



కన్నాయిగూడెంలో..



వాజేడులో..



వెంకటాపురం(కె): జెడ్పీటీసీ పాయం రమణను సన్మానిస్తున్న అధికారులు



ఎస్ఎస్ తాడ్వాయి: అవార్డులు అందుకున్న సర్పంచ్‌లతో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేసి గ్రామాలను అన్ని రంగాల్లో ముందుంచాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగజ్యోతి అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 13 ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నాగజ్యోతి, ఎంపీపీ గొంది వాణిశ్రీ, డీఎంహెచ్‌ఓ, మండల స్పెషలాఫీసర్ అలెం అప్పయ్య శాలువాలతో సత్కరించి షీల్డులు, ప్రసంశ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

ములుగు: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఇక్బాల్‌హుస్సేన్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ సూచించారు. జాతీయ పంచాయతీ అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీలకు బండారుపల్లి సమీపంలోని గిరిజన భవన్‌లో శుక్రవారం అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ బడె నాగజ్యోతి, తహసీల్దార్ సత్యనారాయణరావు, డీబడబ్ల్యూఓ ప్రేమలత, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పవన్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాం నాయక్, ఎంపీఓ రహీం, జెడ్పీ కార్యనిర్వహణఅధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాయలంలో శుక్రవారం జాతీయ పంచాయతీ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్‌లను మండల అధికారులు సన్మానించారు. మండలంలోని పలు పంచాయతీలను జిల్లా స్థాయిలో అవార్డులు తీసుకునేందుకు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఎదిర, సూరవీడు, రాచపల్లి, వాడగూడెం, బీసీ మర్రిగూడెం పంచాయతీలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, తహసీల్దార్ అంటి నాగరాజు, తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని మండలంలోని 11 గ్రామ పంచాయతీలు ఉత్తమ అవార్డులకు ఎంపికైయ్యాయి. అవార్డులకు ఎంపికైన పంచాయతీల సర్పంచ్, కార్యదర్శును మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు మండలకేంద్రంలోని నూతన ఎంఈఓ కార్యలయంలో సన్మానం చేసి ప్రశంస పత్రాలు అందజేశారు. డీపీఓ వెంకయ్య, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీఓ రామకృష్ణ, ఎంపీపీ జనగం సమ్మక్క, వైస్ ఎంపీపీ భాస్కర్ ఉన్నారు.

మంగపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు పంచాయతీ అధికారులు జవాబుదారిగా పనిచేస్తు గ్రామాలను సమస్యలు లేని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక పోషించాలని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. జాతీయ అవార్డులకు ఎంపికైన వివిధ గ్రామ పంచాయతీలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయిన ఆయా గ్రామాల అధికారులును అభినందించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, పీఆర్ఏఈ పాడి వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాకన్న, పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసరు మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను ఎంపీపీ సన్మానించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతి సతత్ వికాస్ పురస్కారం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులు, పంచాయతీల పని తీరు ఆధారంగా వీరిని ఎంపీడీఓ విజయ మెమొంటోలతో పాటు పత్రాలను అందించారు.

మెరుగైన వైద్యం అందించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న రజాక్

ములుగు: హిమోఫోలియో బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని హిమోఫోలియో హైదరాబాద్ సొసైటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. హిమోఫోలియో వైద్యం చాలా ఖరీదైనది కావడంతో బాధితులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని రజాక్ వివరించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ములుగు జిల్లాలో 33 మంది బాధితులు ఉన్నట్లుగా తెలిసిందని అన్నారు. స్పందించిన సూపరింటెండెంట్ ఆస్పత్రి తరుపున ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేసి సహకరిస్తానని అన్నారు.

నిరసన దీక్షకు తరలిరావాలి

మంగపేట: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వేదికగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో చేపట్టే నిరుద్యోగ నిరసన దీక్షకు మండలంలోని బీజేపీ శ్రేణులు, నిరుద్యోగులు తరలిరావాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు శ్రీనువాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నా పత్రాల లీకేజీతో నిరుద్యోగుల భవిష్యత్‌ను కాలరాసిన బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇందిరా పార్కు వద్ద శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు కొనసాగే దీక్షకు విజయవంతం చేయాలన్నారు.

క్షయవ్యాధిని తరిమికొడదాం..



మంగపేట: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

మంగపేట: క్షయ మహమ్మారిని తరమికొడదామని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. క్షయవ్యాధి లక్షణాలు, దాని నివారణకు పొందాల్సిన చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం సోమలక్ష్మి, సీతారావమ్మ, అరుణ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రభుత్వ వైద్యశాలలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ప్రారంభించారు. అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామకృష్ణ, యాకలక్ష్మి, వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

రాహుల్‌గాంధీపై వేటు అప్రజాస్వామికం



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఏటూరునాగారం: రాహుల్ గాంధీపై గుజరాత్‌లోని సూరత్ కోర్టు అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. అనంతర రఘు మాట్లాడుతూ రాహుల్ గాంధీని దోషిగా చెప్పడం బాధాకరం అన్నారు. బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు వేయిస్తోందన్నారు. భారత్ జోడోయాత్ర ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని ఓర్వలేకనే రాహుల్‌గాంధీపై కుట్రలు పన్నుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా మైనార్టి సెల్ అధ్యక్షుడు ఆయూబ్, ఖలీల్, గుడ్ల దేవేందర్, సులేమాన్, రాజు, సత్యం, హరీష్, నరేందర్, లక్ష్మయ్య, రాంబాబు, ముత్తేష్, గౌస్, రవి, రమేష్, భిక్షపతి, సిరాజ్, శ్రీనివాస్, భాగ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నేటి(శనివారం) నుంచి ఏప్రిల్ 15 వరకు సీపీఐ ప్రజా పోరు యాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ పార్టీ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవనంలో పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా పోరు యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోత్కు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి, తెలంగాణ విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ హామీల అమలు కోసం సీపీఐ ప్రజా పోరు యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి విభజన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నేడు బయ్యారంలో ఈ పోరు యాత్రను రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీన హనుమకొండలో ముగింపు భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ యాత్రను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, భద్రయ్య, షాబీర్, రమేష్, శ్రీనివాస్, పుప్పాల వనిత, లావణ్య, సుజాత, స్వరూప, సౌజన్య, తేజ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

భూపాలపల్లి రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ రెండవ దశ అమలుపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ రెండవ దశలో చేయవలసిన కార్యక్రమాలు ఓడిఎఫ్, తడి చెత్త, పొడి చెత్త, వర్షపు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, సానిటేషన్ నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మరుగుదొడ్డికి రెండు గుంతల విధానం గురించి వివరించారు. జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ అధికారులు వెంకటేష్, భాస్కర్, నాగేందర్ రెడ్డి పలు అంశాలపై అవగహన కల్పించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఏటూరునాగారం: న్యూట్రిషన్ ఫుడ్ అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



ములుగు: అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ



వెంకటాపురం(ఎం)లో..

ములుగు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ సూచించారు. తెలంగాణ ఆయుష్ శాఖ తరుపున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం హెల్త్ న్యూట్రిషన్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. న్యూటిషన్‌కిట్‌లో రాగిలడ్డుతో పాటు అనేక పోషకాలతో కూడిన ఆహారం ఉంటుందని అన్నారు. మల్లంపల్లి ఆయుర్వేద వైద్యులు సారంగపాణి మాట్లాడుతూ.. కిట్‌లోని బ్రహ్మీ గ్రాన్యూల్స్ మేధోశక్తిని , రోగనిరోధక శక్తిని అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహబూబ్‌పాషా, ప్రిన్సిపాల్ సుజన, ఫార్మాసిస్ట్ ఉషారాణి, వైద్య సిబ్బంది గౌస్‌పాషా, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటనే పుట్టబోయే బిడ్డకు, పుట్టిన శిశువు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. ఐటీడీఏ ద్వారా ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో రక్తహీనత కలిగిన బాలిలంతకు పోషణ పక్షం కింద న్యూట్రిషన్ ఆహారాన్ని శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, ఐటీడీఏ పీహెచ్‌ఓ రమణ, తహశీల్దార్ సంజీవ, డీఎల్‌పీఓ దేవరాజ్, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డిలు బాలింతలకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనత కలిగిన మహిళలు ఉంటారనే ఉద్దేశంతో ఐటీడీఏ పీఓ అంకిత్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య చొరవతో స్థానికంగా తయారు చేసిన జోహార్ స్వీట్ మిల్, పల్లి, నువ్వుల పట్టి, ఇప్ప పువ్వు లడ్డులను బాలింతలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ హేమలత, సూపర్‌వైజర్లు మనోరమ, శ్రీవిద్య, వసంత, సర్పంచ్‌లు ఈసం రామ్మూర్తి, కాక వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు లలిత, వసంత, సరోజ పాల్గొన్నారు. జిల్లాలోని 2500ల మంది బాలింతలకు ఇప్పపువ్వు లడ్డు, పల్లి, నువ్వుల పట్టి, జోహార్ మిల్ పౌష్టికహార పదార్థాలను ఐటీడీఏ ద్వారా అందిస్తున్నట్లు ఐటీడీఏ పీహెచ్‌ఓ రమణ తెలిపారు. మండలంలో 160 మందికి ఈ కిట్లను సెంటర్ల ద్వారా పంపిణీ చేసినట్లు వివరించారు. ఐటీడీఏ ద్వారా ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో రక్తహీనత కలిగిన బాలింతలకు మూడు నెలల పాటు ఉచితంగా ఇచ్చే విధంగా పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. వీటిని బాలింతలు సద్వినియోగం చేసుకొని వారికి ఉన్న లోపాలను నివారించుకోవాలని రమణ కోరారు.

న్యూట్రిషన్ కిట్స్‌తో రోగనిరోధకశక్తి

వెంకటాపురం(ఎం): ఆయుర్వేద న్యూట్రిషన్ కిట్స్‌తో కిశోర బాలికలకు జ్ఞాపక శక్తితో పాటు రోగనిరోధక శక్తి పెంపొందుతుందని మండల ప్రత్యేకాధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని జవహర్‌నగర్ కస్తూరిబా బాలికల పాఠశాలలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థినులకు ఆయుర్వేద న్యూట్రిషన్ కిట్లను స్థానిక సర్పంచ్ శనిగరపు రమ, ఎంపీపీ బుర్ర రజితతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్ హెల్త్ న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం పేద విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం ఆయుష్ జిల్లా ఇన్చార్జి డాక్టర్ సారంగపాణి ఆయుర్వేదం వైద్యం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ మహబూబ్ పాషా, ఫార్మసిస్టు ఉష పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ప్రభాకర్ గౌడ్

చిట్యాల: మండలంలోని నైన్‌పాకకు చెందిన మండ రమేష్‌గౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. దీంతో బాధితుడికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.15వేల విలువ గల చెక్కును సర్వాయి పాపన్న గౌడ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



ములుగు రూరల్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



పలిమెలలో..

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పోరిక రాంకుమార్‌నాయక్, ఎంపీటీసీ పోరిక విజయ్‌రాం నాయక్‌లు అన్నారు. గురువారం మదనపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రీతి, ఏఎన్ఎం కల్పన, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పలిమెల: మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పుష్పలత చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుచ్చక్క, ఎంపీటీసీ కల్యాణి, మండల ప్రత్యేకాధికారి సుధీర్‌కుమార్, తహసీల్దార్ స్రవంతి, ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దేశానికే ఆదర్శం

నల్లబెల్లి : అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని రాంపూర్‌లో పది గ్రామ పంచాయతీల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామాల వారిగా సమస్యలపై కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులతో చర్చించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఊడుగుల సునీత, వైస్ ఎంపీపీ గందె శ్రీలత, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ గౌడ్, కోటిలింగాచారి, బానోత్ సారంగపాణి, మురళీధర్, శ్రీనివాస్ గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, తేజావత్ సమ్మయ్య నాయక్, పద్మ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274